# కవితా!

సమకాలీన కవితల కాలనాళిక

37

జూన్ 2016



# కవితా! 37

సమకాలీన కవితల కాలనాళిక

జూన్ 2016



నిర్వాహక సంపాదకుడు : శ్రీశ్రీ విశ్వేశ్వరరావు

సెల్ : 94906 34849

సంపాదకుడు : బండ్ల మాధవరావు

సెల్ : 88976 23332

లే-అవుట్ : ఎ. గిరిధర్

సెల్ : 97042 44344


మాట్లాడండి ! రాయండి !! కలవండి !!!


సాహితీమిత్రులు

Regd. No. 48/2012/IV విజయవాడ.

28-10-26/1, మసీదు వీధి, అరండల్‌పేట, విజయవాడ - 2

ఫోన్ : 0866 2433359 సెల్ : 9392971359

kavita.viswam@gmail.com



కవులు, రచయితల అభిప్రాయాలు
వారి వారి స్వంతం.
అవన్నీ అనివార్యంగా పత్రిక అభిప్రాయాలు
కానవసరం లేదు. - పబ్లిషర్స్


**ఇందులో కవులు, విమర్శకులు...**


| | |
|---|---|
| శివారెడ్డి | బండ్ల మాధవరావు |
| ఫక్కి రవీంద్ర | హెచ్చార్కె |
| స్వాతి సాయి యాకసిరి | స్వేచ్ఛ వోటార్కర్ |
| మొయిద శ్రీనివాసరావు | నండూరి రామమోహనరావు |
| చింతా అప్పలనాయుడు | బొల్లోజు బాబా |
| గాలి నాసరరెడ్డి | శ్రీరామ్ |
| రేహన | అద్దేపల్లి ప్రభు |




నేలను సిమెంటుతో తాపడం చెయ్యడం మొదలుపెట్టాక చెట్టు, పుట్ట, పిట్ట, మిట్ట, మట్టి అన్నీ మనిషికి దూరమవుతున్నాయి. "ధ్వంసం చెయ్యడానికేమీ మిగలకపోతే నిన్ను నువ్వు ధ్వంసం చేసుకో అన్నాడో కవి. కాని మనిషి ప్రగతిశీల నిర్మాణాత్మక అంశాలకు కాక సౌకర్యాలపేరుతోనో, అభివృద్ధి పేరుతోనో ప్రకృతిని ధ్వంసం చేస్తున్నాడు. బహుశ ఆకాశ హర్మ్యాల మధ్య, నున్నని తారురోడ్ల మధ్య జీవనం అంతా ధ్వంసం అయ్యాక తనను తాను ధ్వసం చేసుకోడానికి తాను కూడా మిగలని స్థితికి మనిషి చేరుకొంటున్నాడు. ప్రకృతితో సహజీవనం సాగించడం మానేసి ప్రకృతిపై ఆధిపత్యం సాధించాలనుకోవడం మనిషి వినాశనానికి దారితీస్తున్నది. అణిగి ఉంటుందను కొన్న ప్రకృతి వికృతరూపంతో విలయతాండవం చెయ్యడం చూస్తూనే ఉన్నాం. నినాద ప్రాయమైన ప్లాస్టిక్ నిషేధం, చెట్లు పెంచడం, ఇంకుడు గుంటలు లాంటి ప్రకృతి రక్షణ కార్యక్రమాలు మనజీవన విధానంలో అంతర్భాగమవ్వాల్సిన అవసరం ఎంతో ఉంది. చెట్టు నాకు ఆదర్శం అన్న ఇస్మాయిల్ మాటను మరొకసారి గుర్తు చేసుకొంటూ చెట్టే కాదు సమస్త ప్రకృతిని మనకు ఆదర్శవంతంగా చేసుకోవాలని తిరిగి తిరిగి మన ప్రతిన పూనాలి.

## పొంతకుండ

శివారెడ్డి 040-24064195

అదింకా పాడుతూనే వుంది
చేతుల నాలుకలు చాచి నర్తిస్తూ
దుఃఖపు వణుకుళ్ళతో అదింకా పాడుతూనే వుంది
చనిపోతూ పాడటం
ఉద్విగ్నంగా నర్తిస్తూ జ్వాలాకేశాలు
విరబోసి స్వైర విహారిణిలా
పాడటం నర్తించడం దానికొక్క దానికే చేతనవును
ఏదేసినా దగ్ధమౌతుంది
కొత్త అస్తిత్వంతో నూత్న చలనంతో ఎగసిపడుతూ
సర్వాన్ని ఉష్ణంలో ముంచి, ఊపిరులూది
బతికించటమే దాని పాట లక్ష్యం
ఒక పుల్లనెగదోయి
ఒక దేహాన్ని సమర్పించు
యింత బూడిదగా మార్చి
నీకు బహూకరిస్తుంది
చిన్నపుడు కోడిగుండె కాల్చుకున్నా
దబ్బనానికి గుర్చి -
పొంతకుండ కిరువైపులా మంట
పొంతలో వేడినీళ్ళ సంగీత సాధనాలు -
మంటనాకు కొత్తగాదు
మండటం నాకు కొత్తగాదు
మంటని నాలుగక్షరాలుగా
మార్చుకోవటమూ కొత్తగాదు -
దారిపొడుగునా వారబోసింది నెత్తుటిమంటనే
నెనరు చెదరని నాలుగువాక్యాల నెత్తుటిపంటనే
చిన్నప్పుడెప్పుడో
వదిలేశాననుకున్న పొయ్యి నన్ను వదల్లేదు
చేతులు ముఖాన్నే కాదు వెచ్చబెట్టింది
బతుకు మొత్తాన్ని నులివెచ్చని వేడితో నింపింది.■



## ఒంటరిగా

మూలం : పాబ్లో నెరుడా
అనువాదం : బండ్ల మాధవరావు

నువ్వంటే నాకు అసూయ లేదు
ఒకానొక నిండైన మనిషిని
నీ భుజాలపై మోస్తూ రా
నీ శిరస్సుపై వందలాది మనుషులను
నింపుకొని
వేలాది పాదాల ముద్రల మధ్యనుండి
ఓ సారి ఇటురా
మనుషులతో నిండి ప్రవహిస్తున్న నదివై
ఒక అనంత సాగరం దిశగా
పరుగులు పెడుతున్న సమూహానివై రా
నీకోసం
నీతో వచ్చేవారి కోసం
ఇక్కడ నేను దాహార్తినై ఎదురుచూస్తుంటాను
మనం ఎప్పటికీ ఒంటరివాళ్లమే
ఎప్పటీకి ఇంకెప్పటికి
ఒక నువ్వు ఒక నేను మాత్రమే
అయినా
ఈ భూమిపై కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి
ఒంటరిగానే రా!

# అతనో కథల చందమామ !

ఫక్కి రవీంద్ర

అతనంతే!
రాలిపోతున్న పూలను చూసి
రాగాలు తీస్తాడు.
కాలిపోతున్న కలలను గురించి
కథలల్లి చెబుతాడు.
పూసిన ప్రతి పువ్వూ
నిండుగా నవ్వాలంటాడు.
నిదుర పట్టనివ్వని కలలను కన్నది
నిజం చేసుకోడానికి కాక
మరిదేనికని నిలదీస్తాడు.
బీడులైన పొలాలను చూసి
కలత చెందుతాడు
మోడులైన బతుకులను చూసి మథనపడతాడు.
అక్షర స్తన్యమిచ్చి వాటి మోమున
పచ్చని నవ్వయి మెరిసిపోవాలని పరితపిస్తాడు.
అతనెప్పుడూ అంతే!
పల్లె తల్లిలాంటిదంటాడు.
సమస్త వృత్తులు సహవాసం చేసిన
స్వర్గంలాంటి ఊరిప్పుడు
దిగులు మూటై వలస దారి పడుతుంటే
వేదనచెందుతాడు.
దారీ తెన్నూ తెలియని
రూపాయల లోకంలో
తనవారెలా బతుకుతారోనని
పాటై తోడుగా వెళతాడు.
చెట్టును కూల్చి
పిట్టలను పసిడి పంజరాలలో
పెంచుతామనడం,
చెరువును పూడ్చి
చేపలను అక్వేరియంలో ఉంచుతామనడం,
ఊరి మూలాలను తెగ్గోసి
అందరినీ ఉద్ధరించుతామనడం,
అభివృద్ధి కానేకాదంటాడు.
కాసుల కంపలకు
కాసేవి మేడిపండ్లేనని
పదే పదే హెచ్చరిస్తాడు.
అతని తీరంతే !
నలుగురు తెల్ల కాగితంలాంటి
కుర్రాళ్ళను చేరదీస్తాడు.
వారికి సాహిత్య మధురిమలు నింపిన
వారాంతపు సాయంత్రాలను
కానుకలుగా ఇస్తాడు.
కవిత్వమంటే నాగేటి చాలు వెంట
నడకేనని బోధిస్తాడు
కష్టజీవికి రక్షణగా అటూ ఇటూ
మనం 'పెన్ మెన్' లమై
నిలబడాల్సిందేనని నొక్కి చెబుతాడు.
వాళ్ళను రచనా సంకలనాలను చేసి
గుండెగదిలో దాచుకుంటాడు.
పదం కట్టి నాగావళి
అలల అందెల సవ్వడిని
పదిమందికీ వినిపించిన
జానపద వాగ్గేయకారుడతడు.
తూరుపు భాషా కాంతులను
విశ్వవ్యాపితం చేసిన అక్షర మార్తాండుడు.
అతనో అవిశ్రాంత పథికుడు.
అతనో ఏటి పాట!!
అతనో కథల చందమామ!! ■

(సాహితీ దిక్సూచి శ్రీ గంటేడ గౌరునాయుడుగారికి ప్రేమతో)



# కవిత్వాన్ని గురించి...

హెచ్చార్కె

కవిత్వాన్ని (అర్థం కాలేదు అన్న వారికి) వివరించాలా, కూడదా? వివరిస్తే అందులో ఉన్న అందం ఆనందం పోతాయా? **– నారాయణ స్వామి**

**జవాబు :**

ఎవరో గుర్తు లేదు, ఎవరో ప్రసిద్ధుడే అన్నారు. కవిత్వం జోకు లాంటిదని. జోకు ఎంత చెప్పాలో అంతే చెప్పాలి. ఏ కాస్త ఎక్కువ చెప్పినా దాని స్వారస్యం పోతుంది. శ్రోత గంభీరంగా మొహం పెట్టే పరిస్థితి ఏర్పడుతుంది. వక్త గారే హిహిహి... కదూ.... అని జాలిగా నవ్వాల్సి వస్తుంది.

కొందరుంటారు. పాపం వాళ్లు ఏదో ఒక జోకు విన్నప్పుడు చాల నవ్వి వుంటారు. అది చెబుతామని మొదలెడతారు. మన మొహాల్లో కాస్త హాస రేఖ కనపడగానే ఆగామి విజయానికి మురిసిపోయి, తాము పొందిన ఆనందం కన్న ఎక్కువ ఆనందం మనకిద్దామనే మహోద్దేశంతో దానికి మరిన్ని మాటలు చేర్చి శ్రమిస్తారు. వాళ్ల శ్రమను చూసి మనకు చాల జాలేస్తుంది, నవ్వు రాకపోగా. అప్పుడు మనకు నవ్వు రాలేదని ఏమాత్రం అర్థమయినా వాళ్లు చిన్నబుచ్చుకుని మనకు ఆగర్భ శతృవులూ అయిపోతారు. ఉట్టి పుణ్యానికి శతృత్వమెందుకు లెద్దూ అని మనం కుంచెమో ఎక్కువో శక్తి కొలది నవ్వి పెడుతుంటాం.

కవిత్వం గురించి నేను చెప్పేదేమిటి సారు?! కవితా బాధితులు కాని వారెవ్వరీ జగాన. పీడకులలో అత్యధికులు జోకుకు కవిత్వానికి వున్న కనీస సామ్యం తెలియని వారేనని నా పెను డౌటనుమానం.

జోక్ ఎప్పుడు అయిపోయిందో 'జోకర్'కి తెలియాలి. తరువాత ఇంకా చెప్పబోతున్నారంటే, మీ దగ్గర మరో జోకేదో వుండి వుండాలి, మొదటి దాన్ని సాగదీశారా ఏడ్పించారే. కవిత్వం దాదాపు అదే. మీలో ఏదో వెలిగి కవిత రాయడం మొదలెట్టారు. చదివే వాడిలో అది వెలిగే వరకే మీ్రాసేది కవిత. మిగిలింది తవిక. కవితను జోకులతోనే కాకుండా, వార్తలతోనూ పోల్చ వచ్చు. వార్తకు సంబంధించి, ఒక ఎరోటిక్ ఉపమానం చెబుతుంటారు. (జెర్నలిజం స్కూళ్లలో పని చేసే టీచర్ల జేబుల్లో ఇట్టాంటివి చాల వుంటాయి, లేకుంటే చచ్చూరుకుంటారు).

వార్త ఆడపిల్ల స్కర్టు లాంటిది. ఏమేమిట్ని దాచాలో వాటిని దాచాలి. వేటి వేటిని దాచగూడదో వాటిని దాచ గూడదు. దాచాల్సిన వాటిని దాచి చెప్పకపోతే అదొక వ్యాసం అవుతుంది. నిజానికి, బోరు కొట్టించే వ్యాసం. అవతలి వాడు ఏ పరీక్షార్థియో అయితే ఛస్తాడా, చదువుతాడు. ఇష్టం కొద్దీ చదివే వాడయితే పుస్తకాన్ని నేలకు కొట్టి, లోలోపల బండ బూతులు తిట్టి వెళిపోతాడు. పోగా కనబడకూడనివి కనబడితే మనస్సు రెపెల్ అవుతుంది. ఇది కేవలం శరీరాల సంగతే కాదు. హింస విషయమే తీసుకోండి.

ఎక్కడ చూసినా రక్తం మరకలు, తెగిపడిన కండలు, గడ్డ కట్టిన కొవ్వు, వెళ్లుకొచ్చిన ఎముకలు... ఇలా అక్కడ వున్న బీభత్సాన్ని డీటెయిల్డ్ గా వర్ణిస్తే ఏమవుతుంది? చదవడం కాదు కదా ఆ పరిసరాల్లో వుండ బుద్ధేయదు, పాఠకుడికి. 'కత్తి గంటు మీద నెత్తుటి చుక్క లాగుంది దీపం' అని కవి వాక్యం. ఇక్కడ కూడా హింస వుంది. హింస లేకుండా కత్తి ఏమిటి? ఖాళీ కత్తి కూడా కాదు. నెత్తరంటిన కత్తి. కవి తీసుకున్న జాగర్త... కత్తి గంటు మీద నెత్తుటి 'చుక్క' అనడం. హి ఈజ్ లిమిటింగ్ అవర్ ఇమాజినేషన్ విత్ దిస్ వర్డ్ 'చుక్క'. అవి పదాలు కావొచ్చు, వివరాలు కావొచ్చు, ఉద్వేగాలు కావొచ్చు.. వాటిని ఎక్కడి దాక తీసుకెళ్లాలి ఎక్కడ ఆపాలి.. అనేది ఒక కళాకారుడుగా కవి చేసిన నిర్ణయం. కవితా పఠనం/వివరణలో ఆ నిర్ణయాన్ని పాటించడానికే ప్రయత్నించాలి. ఆ 'ఆపడం' అనేది కవిత నిర్మాణంలో భాగం.

--------

కవిత అర్థం కాలేదని అనడం ఒక తిట్టు అని ఇటీవల కొందరు కుండలు పాడు చేస్తున్నారు. తమకు ఏమయిందో చెప్పడానికి పాఠకుల దగ్గర వేరే పదం లేక 'అర్థం కాలేదు' అనే పదాలు వాడారు. మీలాగ గొప్ప కవులు కాదు కదా వాళ్లు?! అసలు సంగతి మీ పద్యం వాళ్లకు అందలేదు. నువ్వేం చెబుతున్నావో అది వాళ్లకు చేర లేదు. వాళ్లను నువ్వు ఏ భావోద్వేగాలకు లోను చేయాలని బయల్దేరావో ఆ భావోద్వేగాలకు వాళ్లు లోను కాలేదు. ఏదో కాస్త తికమక పడడం తప్ప, మిమ్మల్ని చేరుకోడానికి యత్నించి విఫలమైన చిరాకుతప్ప, పద్యం చదివిన తరువాత వాళ్లకు ఏమీ కాలేదు. అదీ వాళ్ల ఫిర్యాదు. అర్థమంటే వాళ్ల వుద్దేశం అదే. పదాలకు అర్థం ఏమిటి అని కాదు, వాక్యాలకు అర్థం ఏమిటి అనీ కాదు. 'ఇంతకూ ఇదంతా ఏమిటి నాయనా' అని వాళ్ల ప్రశ్న. కాబట్టి, పద్యం పాఠకుడికి చేరడానికి తగిన ఏర్పాట్లు పద్యంలో వుండాల్సిందే. పద్యం కమ్యూనికేట్ కావలసిందే. కవిగారూ! మీ పద్యాల్లో కొన్ని కమ్యూనికేట్ అయ్యాయి, కొన్ని కాలేదు... అని పాఠకుడు చెబుతున్నాడు. రంకెలు వేయకుండా వినాలి మరి, ఎడ్యుకేటర్ నీడ్స్ టు బి ఎడ్యకేటెడ్ బై దోస్ బీయింగ్ ఎడ్యుకేటెడ్.

కవిత్వాన్ని ఇంటర్ప్రెట్ చేయడం అనేది ఎప్పటి నుంచో వున్నది. బాగా కొత్త 'మర్యాద'లను పాటించి రాసిన కవితను విమర్శకుడు తన ఇంటర్ప్రెటేషన్ తో పాఠకుని వద్దకు చేర్చ వచ్చు. అదెలాగో చెప్పమని తరచి అడిగితే గుడ్లు తేలేస్తానేమో గాని, ముక్కు తిమ్మన 'పారిజాతాపహరణా'నికి తాపీ దర్మారావు 'హృదయోల్లాస వ్యాఖ్య' అట్టాంటిదే. వేమనలో అర్థం కానిదేముంది గాని, వేమన పద్యాల మీద రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ విమర్శా వ్యాసాలు అద్భుతం. ఇవన్నీ వివరణలే. కవిత్వం సొబగులు పాడు చేయకుండా, మనం రెపెల్ కాని రీతిలో కవితలో దాగి వున్నదేమిటో చెప్పి, దాన్ని దాచడానికి కవి పడిన కష్టాలు చెప్పడం ద్వారా... 'ఔరా' అని మనం ముక్కున వేలేసుకునేట్టు చేసే వివరణలు కూడా వుంటాయి. అవి మంచివి.

ఒక గొప్ప రచన నేపధ్యాన్ని వివరించి, అందులో వున్న అసలు వస్తువుల్ని చూపించే రచనలు వాటికవే చాల బాగుంటాయి. మార్క్వెజ్ 'వన్ హండ్రెడ్ యియర్స్ అఫ్ సాలిట్యూడ్' చాల గొప్ప నవల. ఆయనే రాసిన 'లివింగ్ టు టెల్ ది టేల్' అనే స్వీయచరిత్రాత్మక రచనలో అడుగడుగునా 'హండ్రెడ్

యియర్స్' లోని ప్రదేశాలు, వస్తువులు కనిపించి అబ్బుర పరుస్తాయి. రెండవది మొదటి దాని ఇంటర్ ప్రెటేషన్ వంటిదే.

క్రైమ్ థ్రిల్లర్లు చదివే వారందరికీ తెలిసిన రచయిత ఇర్వింగ్ వాలెస్. ఆయన నోబెల్ ప్రైజ్ చుట్టు కథను తిప్పుతూ రాసిన 'ప్రైజ్' చాల బాగుంటుంది. ఆ రచన నేపధ్యాన్ని వివరిస్తూ ఆయనే రాసిన 'ఆన్ ప్రైజ్' (?) కూడా అంత గొప్పగా వుంటుంది. వివరించడం, అదనపు సమాచారం ఇవ్వడం తప్పు కాకపోగా, ఒక్కోసారి అదే ఒక గొప్ప రచన కూడా అవుతుంది, రాసే వాడిని/ చెప్పే వాడిని బట్టి.

------------

కవిత అర్థం కాలేదని, కవి దాన్ని వివరించబోతే కలిగే అనర్థాలు ముందే చెప్పుకున్నాం. కవి అట్టా వివరించబోవడం, తన కేసు తానే వాదించుకుంటూ కూర్చోవడం.... స్కర్ట్ వదిలేయడం లాంటిదే. నడి రోడ్డు మీద నగ్నంగా నిలబడ్డం లాంటిదే. నగ్నత్వం ఛమ్మల్లో బాగుండొచ్చు గాని, జీవితంలో... చాల ఎక్కువ సార్లు.. బాగోదు.

కొన్ని సార్లు కవిత్వ వివరణ దానికదే గొప్ప అనుభూతి నిస్తుంది. కవిని, కవిత్వాన్ని బాగా ఎరిగిన వారు... దానిలో వున్న... మనకు తెలియని మనుషులను విషయాలను మనకు పరిచయం చేసినప్పుడు కవిత మరింత బాగా మనస్సులకు చేరుతుంది.

ఉదాహరణకి ఒకాయన,

'రెక్కల గుర్రమెక్కి,

రాకాసి శిగ కోసి తెచ్చిన

పాములు నాలో తిరుగుతున్నాయి'

అంటాడనుకోండి. ఇక్కడ రెక్కల గుర్రమంటే పెగాసస్, దాని మీదెక్కి వెళ్లిన పెర్షియస్ మెడుసా తల నరికి, దాని కళ్లలోకి చూడకుండా జాగర్తగా వచ్చి, ఆ కళ్లను సముద్ర రాక్షసికి చూపించి, ఆ రాక్షసిని చంపడం..... ఎట్సెట్రా గ్రీకు పురాణ గాథ. ఇక్కడ కవి మాటల్లో, మెడుసా జుత్తుగా వున్న పాములను కోసి తెచ్చాడని, అవి అతడి మనసులో తిరుగుతున్నాయని కాసింత చమత్కారం. కవితను వివరిస్తో ఈ అల్యూజన్ ను, దానికి అనుబంధంగా గ్రీకు కథనూ చెప్పడం పాఠకుడి లేదా శ్రోత ఆసక్తిని పెంచుతుందే గాని తగ్గిస్తుందని అనుకోను.

ఈ కష్టం పడ లేకనే, (ప్రతి పాఠకుడి దగ్గరికీ వెళ్లి తన అల్యూజన్స్ ని వివరించలేకనే ) కొందరు కవులు పద్యాలకు విరివిగా ఫుట్ నోట్సు ఇస్తుంటారు. 'మో' అలాంటివి చాల ఎక్కవగా చేశాడు. 'రహస్తంత్రి' లోచాల ఎక్కువ ఫుట్ నోట్సున్నాయి. ఫుట్ నోట్సు ఎక్కువయ్యాయని జనం అంటున్నారని ఆయనే ఒక చోట ఎక్కడో చెప్పుకున్నారు. నాకైతే, ఆయన 'సాంధ్య లిపి'కి అలా అధో జ్ఞాపికలు ఇవ్వాల్సిందని అనిపించింది. (ఏ మంటావు సీతారాం?)

ఎలా చేస్తామో ఏమో గాని, అలా ఫుట్ నోట్సు ఇవ్వడం సరైందేనని నా అభిప్రాయం. పఠనానికి

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kavitaa+37**

* * *